# సాక్షి ప్రకాశం

గురువారం | 20 | మార్చి | 2025






**ఇష్టారాజ్యం**

సింగరాయకొండలో మినీ బైపాస్ రోడ్డు విస్తరణ పనుల్లో నిబంధనలకు తిలోదకాలిచ్చారు. పంచాయతీ, వర్క్స్ కమిటీ తీర్మానాలు లేకుండా పనులు చేశారు. - 8లో..




**టీచర్ సస్పెన్షన్..హెచ్ఎంకు షోకాజ్**

కనిగిరిలో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. హెచ్ఎంకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. - 8లో..

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 38/25

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి గాలులు వీస్తాయి.




## న్యూస్‌రీల్

### ప్రాజెక్ట్స్ సర్కిల్ డీఎస్ఈగా హరికృష్ణ రాజు

● గుండ్లకమ్మ–1 ఈఈగా శ్రీహరి

**ఒంగోలు సబర్బన్:** జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్ట్స్ సర్కిల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీర్(డీఎస్ఈ)గా వీఎస్.హరికృష్ణరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కంభం సర్కిల్ డీఈగా పనిచేస్తూ డీఎస్ఈగా పదోన్నతి పొందారు. అందులో భాగంగా ప్రాజెక్ట్స్ సీఈ కార్యాలయంలో డీఎస్ఈగా బాధ్యతలు చేపట్టారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్స్–1 ఈఈగా ఐ.శ్రీహరి కూడా ఎస్ఈ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఈయన కూడా కంభం డీఈగా పనిచేస్తూ ఈఈగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఇద్దరూ ప్రాజెక్ట్స్ ఎస్ఈ సీ.నాగమురళీ మోహన్‌ను కలిసి రిపోర్టు చేశారు.

### పొగాకు బోర్డు ఈడీగా విశ్వశ్రీ



పొగాకు బోర్డు నూతన ఈడీ విశ్వశ్రీ

**కొరిటిపాడు:** భారత పొగాకు బోర్డు నూతన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బి.విశ్వశ్రీ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బి.విశ్వశ్రీని పొగాకు బోర్డు అధికారులు, సిబ్బంది, పలువురు వ్యాపారులు, రైతులు కలిసి అభినందనలు తెలిపారు.

### మధుసూదన్ శాస్త్రికి జీవిత సాఫల్య పురస్కారం



**ఒంగోలు మెట్రో:** జిల్లాకు చెందిన సాహితీవేత్త, కవి, విమర్శకుడు మార్కాపురం శ్రీ సాధన సాహితీ వేదిక కన్వీనర్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ శాస్త్రిని 2025 ఉగాది సందర్భంగా కుర్రా కోటిసూర్యమ్మ స్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సాహిత్య సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రతిభావంతులకు రెండు దశాబ్దాలకు పైగా ప్రతి సంవత్సరం అందిస్తున్న ఈ విశిష్ట పురస్కారానికి ఈ సంవత్సరానికి డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ శాస్త్రి ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన స్వస్థలం గుడ్లూరులో పుట్టిన డాక్టర్ మధుసూదన్ తెలుగు, సంస్కృత సాహిత్యాల్లో వందలాది విమర్శనా వ్యాసాలు, కవితలు, అంతర్జాతీయ పరిశోధన సంచికల్లో విశిష్ట వ్యాసాలు రచించారని, మార్కాపురంలో శ్రీ సాధన సాహిత్య వేదిక నెలకొల్పి అక్కడి నెల నెలా వెన్నెలను పునరుద్ధరించడం ద్వారా 60 పై చిలుకు సాహిత్య సదస్సులు నిర్వహించారన్నారు. విద్యారంగంలో 25 సంవత్సరాలు డిగ్రీ కళాశాల ఆచార్యులుగా తనదైన శైలిలో పని చేస్తూ వేలాది మందిని ప్రయోజకులుగా తీర్చిదిద్దారని చెప్పారు. వారి విస్తృత సేవలకు గుర్తింపుగా ఈ విశ్వావసు నామ తెలుగు ఉగాది సందర్భంగా ఈ జీవిత సాఫల్య పురస్కారం అందిస్తున్నామని తెలిపారు. ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో ఈనెల 29వ తేదీ శనివారం ఉదయం నిర్వహించే శ్రీకృష్ణదేవరాయ ఉగాది కవితా మహోత్సవంలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

### 27న ప్రపంచ రంగస్థల దినోత్సవం

**ఒంగోలు మెట్రో:** ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని ఈనెల 27 న గురువారం సాయంత్రం ఒంగోలులోని సీవీఎస్ రీడింగ్ రూం ఆవరణలో నాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లికార్జునరావు, కనమాల రాఘవులు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి గౌరవాధ్యక్షుడు అన్న నల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొంటారని, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు అధ్యక్షత వహిస్తారన్నారు. కార్యక్రమానికి ముందుగా చందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారులచే నృత్యాలు ఉంటాయని, సభానంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భక్త చింతామణి, రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకాల్లో కొన్ని ఘట్టాలను ప్రదర్శిస్తారని నిర్వాహకులు తెలిపారు.

# రైతు నెత్తిన రాయితీ!




అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన సుబ్బారావు అనే రైతు ప్రభుత్వం సబ్సిడీ పై ఇచ్చే యంత్ర పరికరం కొనుగోలు చేసేందుకు వ్యవసాయ అధికారులను సంప్రదించాడు. పవర్ స్ప్రేయర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పాడు. పవర్ స్ప్రేయర్ కావాలంటే ముందుగా రూ.26,010 నగదు చెల్లించి వస్తువు తీసుకోవాలని, అనంతరం ప్రభుత్వం రూ.10 వేల సబ్సిడీ మీ బ్యాంక్ అకౌంట్‌లో జమచేస్తుందని, ఇందులో రైతు వాటా రూ.16,010 మాత్రమే పడుతుందని చెప్పారు. దీంతో కంగుతిన్న ఆ రైతు ఇటీవల తాను గుంటూరులో పవర్ స్ప్రేయర్ అడిగితే రూ.18 వేలకే ఇస్తానన్నారు.. మరి ప్రభుత్వం ఎందుకు ఇంత ఎక్కువ రేటుకు అమ్ముతోందని ఆశ్చర్యపోయాడు. చివరకు ప్రభుత్వం అందించే సబ్సిడీ పవర్ స్ప్రేయర్ కాకుండా సొంతంగా కొనుక్కున్నాడు.

- ● ఆధునిక వ్యవసాయ యంత్ర పనిముట్ల పేరుతో దగా
- ● సబ్సిడీపై యంత్ర పరికరాల పేరుతో ప్రభుత్వం మోసం
- ● ప్రభుత్వ ధరల కన్నా బయట మార్కెట్లో తక్కువ
- ● ప్రభుత్వం అందించే రేట్లకే సబ్సిడీ ఇస్తామంటున్న అధికారులు
- ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. అన్నదాతకు అండగా ఉంటామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని వంచించాడు. అన్నదాత సుఖీభవ పేరుతో సాయం అందిస్తానని చెప్పి మోసగించాడు. మిరప, వరి, కంది, ఇతర పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు విలవిల్లాడుతున్నారు. తాజాగా సబ్సిడీపై యంత్ర పరికరాల పేరుతో ప్రభుత్వం దగా చేస్తోంది. బహిరంగ మార్కెట్ కంటే ఎక్కువ ధరకు యంత్రాలు అంటగడుతూ చేస్తున్న మోసంపై రైతులు భగ్గుమంటున్నారు.

**నాగులుప్పలపాడు:** వ్యవసాయంలో రైతులకు చేదోడుగా ఉండేందుకు సబ్సిడీపై యంత్రపరికరాలు ఇస్తున్నామని ఇటు అధికారులు, కూటమి ప్రజాప్రతినిధులు, అటు ఎల్లోమీడియా ఊదరగొట్టారు. ఇందుకు సంబంధించి జిల్లాకు రూ.2.7 కోట్లు కేటాయించగా, దాదాపు 1700 పరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఇక్కడే చిన్న తిరకాసు ఉంది. యంత్రపరికరం కావాలంటే మొత్తం నగదు ముందుగానే రైతు చెల్లించాలి. ఆ తర్వాత మెల్లగా సబ్సిడీ బ్యాంక్ అకౌంట్‌లో జమవుతుందని చెబుతున్నారు. అయితే ఆ సబ్సిడీ ఎప్పుడు పడుతుందో మాత్రం అధికారులు కచ్చితంగా చెప్పడం లేదు. ఇదిలా ఉంటే బయట మార్కెట్లో ఇవే యంత్రాలు తక్కువ రేటుకే దొరుకుతుండగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలు మాత్రం భారీగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సబ్సిడీపై అందించే పరికరాలు కొనుగోలు చేయడానికి రైతులు వెనకడుగు వేస్తున్నారు. ప్రస్తుత వ్యవసాయ రంగంలో కూలీల కొరత చాలా ఎక్కువగా ఉంది. రైతులు యంత్రాలతో పనులు చేయించేలా ప్రభుత్వాలు సబ్సిడీపై యంత్రాలు అందించి రైతన్నలను ప్రోత్సహించాలి. కానీ, కూటమి ప్రభుత్వం అందులో కూడా రైతులను మోసగిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు ఇస్తామని, సమీపంలోని వ్యవసాయ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని చెబుతోంది. కానీ, అక్కడికి వెళ్లిన రైతులకు యంత్ర పరికరాల రేట్లు చూసి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి.

**బయట షోరూంలో ఎమ్మార్పీకే దొరుకుతున్న యంత్రాలు...**

ఏడు గొర్ల కల్టివేటర్ ధర ప్రభుత్వం రూ.28,560గా నిర్ణయించింది. ఇందుకు 50 శాతం సబ్సిడీ రూ.14280 రైతుకు అందుతోంది. అయితే ఈ ఏడు గొర్ల కల్టివేటర్ బయట మార్కెట్లో రూ.22,400కు దొరుకుతోంది. కలుపు తీసే పవర్ వీడర్ 5 హెచ్‌పీ మార్కెట్లో రూ.28 వేల నుంచి రూ.32 వేలకు దొరుకుతుంది. కానీ ప్రభుత్వం మాత్రం రూ.57,120గా నిర్ణయించింది. పవర్ టిల్లర్ 13 హెచ్‌పీ బయట మార్కెట్లో రూ.1.45 లక్షల నుంచి రూ.1.85 లక్షలకు అందుబాటులో ఉంది. కానీ, ప్రభుత్వం మాత్రం దీని ధరను రూ.2,29,500గా నిర్ణయించింది. బ్రష్ కట్టర్ బయట మార్కెట్లో రూ.6,950 నుంచి రూ.8,259 మధ్యలో దొరుకుతోంది. కానీ, ప్రభుత్వం ధర రూ.12,750గా నిర్ణయించింది. ఈ లెక్కన సబ్సిడీపై యంత్రాలు అందజేత అనేది రైతులకు కుడి చేత్తో అందించి ఎడమ చేత్తో లాగేసుకునే చందంగా తయారైందని, ఈ యంత్ర పరికరాలను తీసుకోవడానికి రైతులు మొగ్గుచూపడం లేదని వ్యవసాయాధికారులే చెబుతుండటం గమనార్హం.

| ఉత్పత్తి వివరణ | మోడల్ | 2024–25 లో ప్రభుత్వం నిర్ణయించిన ధర | సబ్సిడీ | రైతు వాటా | బయట మార్కెట్‌లో దొరుకుతున్న రేటు |
|---|---|---|---|---|---|
| 7 టైన్ రిజిట్ కల్టివేటర్ | | 28,560 | 14,280 | 14,280 | 22,400 |
| 7 టైన్ రిజిట్ కల్టివేటర్ | 240 కిలో | 32,640 | 16,320 | 16,320 | 24,700 |
| లెవలింగ్ బ్లేడ్ | 6 అడుగులు | 30,600 | 15,300 | 15,300 | 23,000–25,000 |
| విత్తనం నాటే పరికరాలు | | 63,240 | 25,000 | 38,240 | 51,750 |
| రోటావేటర్ | 5 అడుగులు | 1,45,860 | 46,000 | 99,860 | 1 లక్ష |
| పవర్ స్ప్రేయర్ | | 26,010 | 10,000 | 16,010 | 18,000 |
| పవర్ వీడర్ | | 57,120 | 28,560 | 28,560 | 28,000–32,000 |
| పవర్ టిల్లర్ | 13 హెచ్‌పీ | 2,29,500 | 1,00,000 | 1,29,500 | 1.60 లక్షలు |

**బయట మార్కెట్‌లో తక్కువ ధరకే పరికరాలు**



ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ యంత్రాలు రైతాంగానికి చాలా దూరంగా ఉంటున్నాయి. ఈ యంత్రాలు కూడా బయట మార్కెట్‌లో తక్కువ ధరకు అందుబాటులో ఉండటంతో ప్రభుత్వం అందించే సబ్సిడీ చాలా ఎక్కువగా ఉంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సబ్సిడీ శాతాన్ని పెంచాలి.

– జయంత్‌బాబు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు



బాధితులకు రిలీఫ్ సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

# బానిస బంధనాల నుంచి విముక్తి

● కలెక్టర్ తమీమ్‌అన్సారియా చొరవతో కూలీలకు స్వేచ్ఛ

**ఒంగోలు సిటీ:** వారంతా రోజువారీ కూలీలు. వారి పేదరికాన్ని ఆసరాగా చేసుకుని ఉపాధి కల్పిస్తామని ఆశ చూపి, యజమాని బానిసత్వంలో బంధించాడు. అయిన వారికి, ఉన్న ఊరికి దూరంగా దీన స్థితిలో కాలం వెళ్లదీస్తున్న వారికి కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాలతో జిల్లా అధికారులు విముక్తి కల్పించారు. వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పిస్తూ బుధవారం కలెక్టరేట్లోని తన చాంబరులో కలెక్టర్ తమీమ్ అన్సారియా రిలీఫ్ సర్టిఫికెట్లు అందించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపట్నం మండలంలోని ఆలూరు, ఈతముక్కల గ్రామాలకు చెందిన ఏడు కుటుంబాలు చిలకలూరిపేట సమీపంలో జామాయిల్ తోటల్లో పనికి వెళ్లారు. వారి అమాయకత్వాన్ని, అవసరాన్ని, పేదరికాన్ని అవకాశంగా చేసుకున్న యజమాని, వారితో వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. గర్భిణి, బాలింతలతోనూ బలవంతంగా పని చేయిస్తున్నట్లు యానాది సంఘాల మహా కూటమి, ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, ఇతర సంబంధిత శాఖల అధికారులు రంగంలోకి దిగారు. ఈ ఏడు కుటుంబాల్లోని మొత్తం 33 మందికి విముక్తి కల్పించి ఒంగోలు తీసుకొచ్చారు. కలెక్టర్ చేతుల మీదుగా రిలీఫ్ సర్టిఫికెట్లతో పాటు స్వీట్లు, దుస్తులు, ఇతర వంట సరుకులను అందించారు. చట్ట ప్రకారం ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించడంతో పాటు జీవనోపాధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బాధితుల్లోని ఆసక్తి, అర్హతను బట్టి తగిన శిక్షణ కూడా ఇప్పించాలని నిర్దేశించారు. దయనీయ స్థితిలో ఉన్న తమకు స్వేచ్ఛ కల్పించిన కలెక్టర్ తమీమ్‌అన్సారియా కు బాధితులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్‌డీవో లక్ష్మీ ప్రసన్న, డీఎస్‌వో పద్మశ్రీ,, పౌరసరఫరాల సంస్థ డీఎం వరలక్ష్మి, తహసీల్దార్ మధు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆర్.సునీల్ కుమార్ (సార్డ్స్), శ్యామ్, పాషా, డేవిడ్ (ఐ.జె.ఎం.), ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అన్ని కేంద్రాల్లో పొగాకు వేలం ప్రారంభం

- ● నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని 7 వేలం కేంద్రాల్లో ప్రారంభం
- ● కిలో అత్యధిక ధర రూ.280, అత్యల్పం రూ.260
- ● ఒంగోలు–2 వేలం కేంద్రాన్ని పరిశీలించిన పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్



పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న ఛైర్మన్, అధికారులు

**ఒంగోలు సబర్బన్:** నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో రెండో విడత పొగాకు వేలం బుధవారం ప్రారంభమైంది. రెండు జిల్లాల్లో కలిపి రెండో విడత 7 వేలం కేంద్రాల్లో ప్రారంభించారు. ప్రకాశం జిల్లా త్రోవగుంటలోని ఒంగోలు–2 వేలం కేంద్రంతో పాటు వెల్లంపల్లి, టంగుటూరు, కనిగిరి వేలం కేంద్రాల్లో, నెల్లూరు జిల్లాలోని కందుకూరు–2తో పాటు కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాల్లో కూడా వేలం నిర్వహించారు. రెండో విడత నిర్వహించిన వేలం కేంద్రాల్లో రైతులు ఆనవాయితీగా ఒక్కో వేలం కేంద్రానికి కేటాయించిన గ్రామాల నుంచి లక్కీ నంబరు 9 వచ్చేలా ఒక్కో రైతు 18 పొగాకు బేళ్ల ట్రాక్టర్లలో వేలం కేంద్రానికి తీసుకొచ్చారు. తొలిరోజు 1420 బేళ్లు రాగా 15 కంపెనీలు వేలంలో పాల్గొన్నాయి. మొత్తం 24 కంపెనీలు రిజిస్టర్ అయ్యాయి. రెండు జిల్లాల్లో కలిపి నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు అత్యధికంగా రూ.280 పలికింది. అత్యల్పంగా రూ.260కి పడిపోయింది. నిన్నటి వరకు అత్యల్ప ధర రూ.270, రూ.278 వరకు ధర ఒక్కసారిగా రూ.260కి పడిపోయింది.ఈ సంవత్సరం పొగాకు సీజన్ పూర్వగానే తొలివిడతగా ఈ నెల 10వ తేదీ ఒంగోలు నగర పరిధిలోని పేర్నమిట్టలో ఉన్న ఒంగోలు–1 వేలం కేంద్రంతో పాటు కొండపి, పొదిలి వేలం కేంద్రాల్లో ప్రారంభించారు. నెల్లూరు జిల్లా కందుకూరు–1 వేలం కేంద్రంలో కూడా ప్రారంభమైంది. రెండో విడత వేలాన్ని పొగాకు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ ఒంగోలు–2 వేలం కేంద్రాన్ని సందర్శించారు. ఆయనతో పాటు వైస్ ఛైర్మన్ బ్రహ్మయ్య కూడా ఉన్నారు. వేలం తీరును వ్యాపారులతో కలిసి పరిశీలించారు. ఆయనతో పాటు ఒంగోలు పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు, వేలం కేంద్రం నిర్వహణాధికారి జే.తులసితో పాటు పొగాకు రైతులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

# యాజమాన్య విద్యతో సువర్ణావకాశాలు

● ఏకేయూ ఉప కులపతి ప్రొఫెసర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు

**ఒంగోలు సిటీ:** పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో యాజమాన్య విద్యను అభ్యసించిన విద్యార్థినీ విద్యార్థులకు నేటి కాలంలో ఉద్యోగ, ఉపాధి పరంగా సువర్ణావకాశాలు మెండుగా ఉన్నాయని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. బుధవారం స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్సిటీ సమావేశ హాలులో కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ యాజమాన్య విద్యను అభ్యసించిన విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు మెండుగా ఉంటాయని, అటువంటి వారిలో టీమ్ స్పిరిట్ ఆశించిన మేరకు ఉంటుందన్నారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వ్యక్తి తనకు అవసరమైన మేరకు విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దడంలో, నాయకత్వ పటిమ పెంపొందించడంలో యాజమాన్య విద్య ఎంతగానో ఉపయోగ పడుతుందని చెప్పారు. ఇందులో భాగంగానే డిగ్రీ స్థాయిలో సాధారణ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులతో పాటు ఇంజినీరింగ్, ఫార్మా తదితర విభాగాల్లో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు సైతం పీజీ స్థాయిలో యాజమాన్య విద్యను అభ్యసించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గుత్తి రాజమోహన్ రావు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్య ద్వారా ప్రత్యేకమైన మెళకువలు తెలుసుకోవచ్చన్నారు. గోవా విశ్వ విద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ బొమ్మదేవర రమేష్ 'డైనమిక్స్ ఆఫ్ బిజినెస్ ఎడ్యుకేషన్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశం అనంతరం బొమ్మదేవర రమేష్‌ను ఏకేయూ ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ హరిబాబు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రాజమోహనరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ బి.పద్మజ, బోధన, బోధనేతర సిబ్బంది, ఎంబీఏ, ఎంకాం విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలింగ్ బూత్‌లు, ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలి

● డీఆర్వో చిన ఓబులేసు



పొలిటికల్ పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో చిన ఓబులేసు

**ఒంగోలు సిటీ:** పోలింగ్ బూత్‌లు, ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలని డీఆర్వో చిన ఓబులేసు అన్నారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో మంగళవారం రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఒక్క ఓటుకు ఆధార్ అనుసంధానం చేస్తామని తెలిపారు. జిల్లాలోని పోలింగ్ స్టేషన్లు సరిగ్గా ఉన్నదీ, లేనిది గుర్తిస్తామని, పోలింగ్ బూత్‌కు 1400 ఓట్లు దాటితే వేరే కొత్త పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. పొలిటికల్ పార్టీలు బీఎల్‌ఏలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. చనిపోయిన వారి ఓట్లు తెలపాలని, వారి ఓట్లు తొలగించటానికి ప్రజల సహకరించాలని కోరారు. కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, కనిగిరి ఆర్డీవో కేశవర్ధనరెడ్డి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వెంకట శివ రామిరెడ్డి, జాన్సన్, ఎ.కుమార్, వరకుమార్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, జిల్లా ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, పొలిటికల్ పార్టీల ప్రతినిధులు దామరాజు క్రాంతికుమార్, రసూల్, వెంకటరావు, బసినేపల్లి రాజశేఖర్, గుర్రం సత్యం, వేష పోగు సుదర్శన్, వెంకటస్వామి, రమేష్, తహశీల్దార్లు, ఎన్నికల అధికార్లు రాజశేఖర్ రెడ్డి, ఉపేంద్ర,పాల్గొన్నారు.

# నేస్తమా.. క్షేమమా?





వాసాలపై.. వసారాల్లో తచ్చాడుతూ.. వడ్ల గింజలను కసితీరా పొడిచి తింటూ.. కిచకిచమని అల్లరి చేసే పిచ్చుకలు నచ్చనిదెవరికి? అమ్మమ్మలు చెప్పే కాకి–పిచ్చుక కథలో తెలివైనది పిచ్చుకే. అంతేనా పిచ్చుక ఓ సోషలిస్ట్. ఎదుట ఎంత ఆహారమున్నా తినాలనుకున్నంతే తిని తుర్రున ఎగిరిపోతుంది. ఇక చాటలో బియ్యం చెరుగుతుంటే చెంగు చెంగున ఎగిరొచ్చి అమ్మలక్కలను పలకరించే పిచ్చుకలకు కొదవలేదు! గురి తప్పిన బాణంలా ఇంట్లోకి దూసుకొచ్చి గిరికీలు కొట్టినా.. అద్దంలో ముఖం చూసుకుని మురిసిపోయినా అది పిచ్చుకలకే చెల్లు! తొలి పంటను పిచ్చుక ముడితే మంచిదన్న నమ్మకం రైతులతో వాటి అనుబంధాన్ని చాటుతుంది. అసలే ఎండలు మండిపోతున్నాయ్.. పిచ్చుకలకు ధాన్యమేసి కాస్త నీళ్లు పెట్టండి ఫ్రెండ్స్..

– సాక్షి, ఒంగోలు

# బాలల భద్రత, సంరక్షణకు విఘాతం కలిగించొద్దు

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

**ఒంగోలు సిటీ:** కొంతమంది ఉపాధ్యాయులు బాలల భద్రత, బాలల సంరక్షణకు విఘాతం కలిగించటం, లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడడం విచారకరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి మంగళవారం అన్నారు. కనిగిరిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై తీవ్రంగా స్పందించిన ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకునేందుకు ప్రతి పాఠశాలలో సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యాశాఖతో పాటు పోలీసు, ఐసీడీఎస్, డీసీపీయూ కలిసి దర్యాప్తు చేపట్టి ఇంకా ఎంతమంది బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించాడు, లైంగిక వేధింపులకు గురి చేశాడనే విషయాన్ని పరిశీలించి సమగ్ర నివేదిక ను రెండు రోజుల్లోనే రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు సమర్పించాలని అన్ని శాఖలను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి స్కూల్లో ప్రొటెక్షన్ కమిటీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలకు తగిన కౌన్సిలింగ్, తల్లిదండ్రులతో ఉపాధ్యాయులకు ఒక మీటింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. జిల్లాలో గవర్నమెంట్ ప్రైవేట్ స్కూల్లో బాలల సంరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని విద్యాశాఖను ఆదేశిస్తూ, పోలీస్, ఐసీడీఎస్ సమన్వయంతో డీసీపీయూ ద్వారా పిల్లలకు తగిన రక్షణ కల్పించాల్సిందిగా ఆదేశించారు.

## క్లుప్తంగా

### రేపటి నుంచి జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

**కొనకనమిట్ల:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో నిర్వహించే వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తిరునాళ్ల సందర్భంగా ఈనెల 21, 22, 23 తేదీల్లో మూడు రోజులపాటు జాతీయ స్థాయి ఎడ్ల బండ లాగుడు బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు వెలుగొండ దేవస్థానం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి, సభ్యులు జవ్వాజి బాషాపతినాయుడు, మేకలవారిపల్లి రెడ్ల సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. 21వ తేదీన ఆరు పండ్ల సైజు విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభమవుతాయి. 22, 23వ తేదీల్లో న్యూ కేటగిరీ, సీనియర్ విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు.

**బహుమతుల వివరాలు..**

ఆరు పళ్ల సైజు విభాగంలో గెలుపొందిన ఎడ్లకు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, బహుమతులను వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు అందజేస్తామన్నారు. న్యూ కేటగిరీ విభాగంలో గెలుపొందిన ఎడ్లకు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు బహుమతులు రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు అందజేస్తామన్నారు. సీనియర్ విభాగంలో గెలుపొందిన ఎడ్లకు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు బహుమతులను వరుసగా రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలను దాతల సహకారంతో అందజేస్తామన్నారు. అలాగే ఎడ్ల పోటీల్లో పాల్గొని బహుమతులు రాని ప్రతి ఎడ్ల జతకు రూ.5 వేల చొప్పున కాసు చారిటబుల్ ట్రస్టు తరఫున ఇవ్వనున్నట్లు కమిటీ వారు తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఎడ్ల యజమానులు ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. వివరాలకు 8008716521, 9505345703, 9963429928, 9581137317 నంబర్లను సంప్రదించాలన్నారు.

### కాపులపై కూటమి ప్రభుత్వానికి ఎందుకీ వివక్ష

**ఒంగోలు వన్‌టౌన్:** కాపులపై కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోందని కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వయం ఉపాధి పథకం లబ్ధిదారులకు అన్ని కులాల వారికి 21 నుంచి 60 సంవత్సరాల వరకూ దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపిందన్నారు. అయితే తెలగ, బలిజ, కాపు, ఒంటరి కులస్తులకు 21 నుంచి 50 సంవత్సరాల వయస్సుకు మాత్రమే పరిమితం చేయడం ఎంత వరకూ న్యాయం అని అన్నారు. ఇటువంటి వివక్ష కాపులకు మాత్రమే ఎందుకు అని ప్రశ్నించారు.


### చెక్ బౌన్స్ కేసుల్లో ఇద్దరికి జైలు

**ఒంగోలు:** రెండు వేర్వేరు చెక్ బౌన్స్ కేసుల్లో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష విధిస్తూ స్థానిక ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎస్.కోమలవల్లి బుధవారం తీర్పు వెల్లడించారు. సంతనూతలపాడు మండలం మద్దులూరుకు చెందిన చీదెండ్ల కళ్యాణ్ కుమార్ వద్ద 2016 జూన్ 29న కుటుంబ అవసరాల నిమిత్తం పర్వతరెడ్డి వెంకట సత్యనారాయణ రూ.4 లక్షలు రుణంగా తీసుకున్నాడు. బకాయి చెల్లింపు నిమిత్తం సత్యనారాయణ రూ.4.85 లక్షల చెక్కు ఇవ్వగా అది బ్యాంకులో బౌన్స్ అయింది. దీనిపై కోర్టును ఆశ్రయించగా నేరం నిరూపణ కావడంతో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష విధించి, రూ.6 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు. మరో చెక్ బౌన్స్ కేసులో.. తన్నీరు లింగరాజు వద్ద పాలపర్తి వినోద్ కుమార్ కుటుంబ అవసరాల నిమిత్తం రూ.2 లక్షలు రుణం తీసుకున్నాడు. బకాయి నిమిత్తం 2017లో వినోద్ చెక్కు ఇవ్వగా బ్యాంక్‌లో బౌన్స్ అయింది. దీంతో లింగరాజు కోర్టును ఆశ్రయించాడు. విచారణ అనంతరం నేరం రుజువైనట్లు పేర్కొంటూ నిందితుడు వినోద్‌కుమార్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధించిన న్యాయమూర్తి, లింగరాజుకు రూ.4 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

- సింగరాయకొండలో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణం
- రూర్బన్ నిధులు రూ.10 లక్షలతో మినీ బైపాస్ రోడ్డు వెడల్పు
- పంచాయతీ, వర్క్స్ కమిటీ తీర్మానాలు లేకుండానే పనులు
- రోడ్డు మార్జిన్‌లో విద్యుత్ స్తంభాల తొలగింపుపై దాటవేత ధోరణి
- ఆక్రమణల తొలగింపులో అధికారుల పక్షపాతం



7 అంగుళాల మందంతోనే సీసీ రోడ్డు వేసినట్లు చూపుతున్న నౌషద్



అధికారులు పక్షపాతం చూపి వదిలేసిన బంకు

# ఇష్టారాజ్యం..

**సింగరాయకొండ:** అధికారం చేతిలో ఉంటే ఏమైనా చేయొచ్చని కూటమి పాలకులు మరోమారు నిరూపించారు. సింగరాయకొండ మండల కేంద్రంలో చిన్నపాటి సీసీ రోడ్డు నిర్మాణంలో అధికారులు, స్థానిక కూటమి నాయకులు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశమైంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వెనక వైపున ఉన్న మినీ బైపాస్ రోడ్డును వెడల్పు చేసేందుకు ప్రభుత్వం సుమారు రూ.10 లక్షలు కేటాయించింది. ఈ పనిని దక్కించుకున్న స్థానిక జనసేన నాయకుడు నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజూ స్కూల్ బస్సులు, టిప్పర్లు తిరిగే ఈ సీసీ రోడ్డును 10 అంగుళాల మందంతో నిర్మించాల్సి ఉండగా కేవలం 7 అంగుళాలకే పరిమితం చేయడం విమర్శలకు తావిచ్చింది. మలుపు వద్ద రోడ్డును పటిష్టంగా నిర్మించాల్సి ఉండగా ఇంజినీరింగ్ అధికారులు అదేమీ పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. పైగా రోడ్డుకు 21 రోజుల పాటు క్యూరింగ్ చేయాల్సి ఉండగా కేవలం మూడు రోజుల్లోనే ముగించడంపై విమర్శలొస్తున్నాయి.

**రోడ్డు మార్జిన్లో విద్యుత్ స్తంభాలు**

మినీ బైపాస్ వెడల్పు చేసే క్రమంలో గత నెలలో రోడ్డు మార్జిన్లో ఉన్న రెండు బంకులు తప్ప మిగిలినవి తొలగించారు. పేదల జీవనోపాధిని దెబ్బతీయడంపై పత్రికల్లో కథనాలు రావడంతో మంత్రి స్వామి నష్ట నివారణ చర్యలకు పూనుకున్నారు. ఆ రెండు బంకులతోపాటు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించాలని అధికారులను ఆదేశించారని జోరుగా ప్రచారం జరిగింది. చివరికి ఒక బంకును తొలగించిన అధికారులు, రెండో బంకును కేవలం పక్కకు జరిపి పక్షపాతం చూపారు. కాగా రోడ్డు మార్జిన్‌లో దేవి సీ ఫుడ్స్ కంపెనీకి వెళ్లే ప్రత్యేక విద్యుత్ లైన్ స్తంభాలను అలాగే ఉంచడాన్ని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. గత ప్రభుత్వంలో నిబంధనలు అతిక్రమిస్తున్నారని నానాయాగీ చేసిన టీడీపీ, జనసేన నాయకులు ఇప్పుడు చేస్తున్నదేంటని, రోడ్డుకు ఇరువైపులా ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఉంచి రోడ్డు ఎలా నిర్మిస్తున్నారని వైఎస్సార్ సీపీ నేతలు నిలదీస్తున్నారు.



విద్యుత్ స్తంభాలు పక్కకు మార్చకుండానే రోడ్డు నిర్మాణం

**తీర్మానాలు లేకుండానే..**

మినీ బైపాస్ రోడ్డు సింగరాయకొండ, మూలగుంటపాడు పరిధిలోకి వస్తుంది. రెండు పంచాయతీల నుంచి తీర్మానాలు చేయాల్సి ఉండగా ఈ రోడ్డు మూలగుంటపాడు పరిధిలోకి వస్తుందని, గతంలోనే తీర్మానాలు చేశామని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. మూలగుంటపాడు పరిధిలో రోడ్డు నిర్మిస్తుంటే.. విద్యుత్ స్తంభాల తొలగింపు పనులకు సింగరాయకొండ పంచాయతీ నిధులు ఎలా వినియోగిస్తారన్న ప్రశ్నకు సమాధానం లేదు. పంచాయతీల వర్క్స్ కమిటీ ఆమోదం కూడా లేకుండా పనులు చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ రోడ్డు పనులకు తీర్మానాలు తాము ఇవ్వలేదని, గతంలో ఇచ్చారో లేదో తమకు తెలియదని పంచాయతీ అధికారులు పేర్కొనడం పాలకుల వైఖరిని తేటతెల్లం చేస్తోంది.

> **కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం**
>
> నిబంధనల ప్రకారం రోడ్డు నిర్మిస్తున్నామని చెబుతున్న పంచాయతీరాజ్ అధికారులు తీర్మానాల కాపీలు చూపాలి. గతంలో రోడ్డు మందం 10 అంగుళాలు ఉంటే ఏ నిబంధనల ప్రకారం ఇప్పుడు 7 అంగుళాలు వేశారు. రోడ్డు పనులకు వాడిన మెటీరియల్ నాణ్యత పరీక్ష ఫలితాలు కూడా బయటపెట్టాలి. కానీ ఇవేవీ పట్టించుకోకుండా ఇష్టారీతిగా రోడ్డు వేస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.
>
> – షేక్ నౌషాద్, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం మండల అధ్యక్షుడు

## కేసుల్లో సమగ్ర విచారణ చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్



సమీక్షా సమావేశంలో పాల్గొన్న డీఎస్పీలు, సిఐలు

- ఎస్పీ దామోదర్

**ఒంగోలు సిటీ:** కేసుల్లో సమగ్ర విచారణ చేసి త్వరితగతిన నిందితులను అరెస్ట్ చేయాలని ఎస్పీ దామోదర్ అన్నారు. జిల్లాలో నమోదైన నకిలీ డాక్యుమెంట్స్, స్టాంపులు, భూ అక్రమ, ఫోర్జరీకి సంబంధించిన 109 కేసులపై ప్రత్యేక దర్యాప్తు టీం అధికారులతో బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ఆయా కేసుల దర్యాప్తు తీరుతెన్నులు, పురోగతి, నిందితుల అరెస్టు, చార్జిషీటు దాఖలు తదితర అంశాలపై పోలీస్ అధికారులను ఆరా తీసి, కేసుల సంబంధిత డాక్యుమెంట్స్, సీడీ ఫైల్స్ పరిశీలించారు. కేసుల సత్వర పరిష్కారానికి సూచనలిచ్చారు. ఒకే ప్రాంతానికి చెందిన పలు కేసులను ఇతర పోలీస్ అధికారులకు కేటాయించారు. ఈ కేసుల్లో నకిలీ పత్రాలు, స్టాంపులు, ఫోర్జరీ సంతకాలతో జరిగిన భూ అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తి స్థాయిలో వినియోగించాలని సిట్ అధికారులకు సూచించారు. నకిలీ డాక్యుమెంట్స్ గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక ఆధారాలతో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు, రిజిస్ట్రార్ వారి సహకారం, సమన్వయంతో దర్యాప్తు చేయాలని, ఇళ్ల స్థలాలు, ప్లాట్లు, భూములపై రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర పత్రాలను సంబంధిత శాఖల ద్వారా వెరిఫై చేసి వాటికి సంబంధించిన వాస్తవ యజమానులు, డాక్యుమెంట్లను గుర్తించాలన్నారు. ఈ కేసుల్లో దర్యాప్తు మరింత వేగవంతం చేసి నిందితులను సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేయాలని, పూర్తయిన కేసుల్లో చార్జిషీట్లు ఫైల్ చేసి కోర్టులో విచారణ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ, మార్కాపురం డీఎస్పీ నాగరాజు, కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, సిట్ టీం సీఐలు పాల్గొన్నారు.

### 'ఇక నా వల్లకాదు.. అమ్మను జాగ్రత్తగా చూసుకోండి'

- కుమార్తెకు ఫోన్ చేసి వృద్ధుడి ఆత్మహత్య

**ఒంగోలు టౌన్:** ''ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. ఇక నావల్ల కావడం లేదు. అమ్మను జాగ్రత్తగా చూసుకోండి'' అని కూతురికి ఫోన్ చేసి చెప్పిన ఓ 70 ఏళ్ల వృద్ధుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని రంగుతోటకు చెందిన బోయపాటి వెంకటరావు చాలా కాలంగా కిడ్నీ జబ్బు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో జీవితం మీద విరక్తి చెందిన ఆయన కూతురికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకోబోతున్నానని, అమ్మను బాగా చూసుకోవాలని చెప్పారు. అంతలోనే కొత్తపట్నం బ్రిడ్జికి కాస్త దూరంలో కరవది వైపు రైలు కింద పడి మరణించారు. కుమార్తె అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇవ్వడంతోపాటు స్వయంగా వెదకడం ప్రారంభించారు. ఈలోగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు వెళ్లిచూడగా వెంకటరావు రైలు పట్టాలపై విగత జీవిగా పడి ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## శేష వాహనంపై శ్రీవారు



హోమం నిర్వహిస్తున్న ఉభయదాతలు



కృష్ణావతారంలో దర్శనమిస్తున్న శ్రీవారు

**కొనకనమిట్ల:** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భక్తుల జయజయ ధ్వానాల మధ్య అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శ్రీవారికి రోజుకొక అవతారంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం శ్రీవారు పల్లకిలో అలంకరించిన శేష వాహనంపై శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారికి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య మేళతాళాలతో వెలుగొండ పురవీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవ ఉభయదాతలుగా మారెళ్ల నాగ వెంకట దిలీప్‌కుమార్, తిరుపతి రావు, వెంకట సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు దంపతులు వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వేదపండితులు ప్రసాదాచార్యులు, భార్గవాచార్యులు స్వామివారికి అర్చనలు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. గురువారం శ్రీవారు హనుమంత వాహనంపై శ్రీవారి ఉత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు.

## కాలేజీ బస్సు దగ్ధం



దగ్ధమవుతున్న ప్రైవేట్ కళాశాల బస్సు

**పొన్నలూరు:** పార్కింగ్‌లో ఉన్న కళాశాల బస్సులో వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి దగ్ధమైంది. ఈ సంఘటన పొన్నలూరు మండలంలోని చెరువుకొమ్ముపాలెంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చెరువుకొమ్ముపాలెం జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులను కందుకూరులోని ఓ ప్రైవేట్ కాలేజీ బస్సులో పొన్నలూరు జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. పరీక్ష అనంతరం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బస్సు విద్యార్థులతో సహా చెరువుకొమ్ముపాలెం చేరుకుంది. విద్యార్థులు దిగిపోయిన తర్వాత డ్రైవర్ పాఠశాల సమీపంలో బస్సును నిలిపి భోజనం చేసేందుకు కె.అగ్రహారం వెళ్లారు. ఇంతలోనే బస్సులో వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. స్థానికులు గమనించి మంటలను అదుపు చేసి, అగ్నిమాపక సిబ్బందికి కూడా సమాచారం అందించారు. బస్సు షార్ట్ సర్క్యూట్‌తోనే దగ్ధమైందా లేక ఎవరైనా ఆకతాయిలు నిప్పుపెట్టారా? అని విచారణలో తేలాల్సి ఉంది.

### కారును ఢీకొన్న అంబులెన్స్

- రెండు వాహనాల్లో ఉన్న 8 మంది సురక్షితం



ప్రమాదం ధాటికి డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

**సింగరాయకొండ:** ముందు వెళ్తున్న కారు వేగం ఒక్కసారిగా నెమ్మదించడంతో వెనుకనే వస్తున్న అంబులెన్స్ అదుపుతప్పి ఢీకొట్టిన సంఘటన సింగరాయకొండలోని కందుకూరు ఫ్లైఓవర్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. రెండు వాహనాల్లో మొత్తం 8 మంది ఉండగా ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. మిగిలిన వారు సురక్షితంగా ఉన్నారు. హైవే పోలీసుల కథనం ప్రకారం టంగుటూరు మండలం కాకుటూరివారిపాలెంకు చెందిన అమృతకుమార్ తన స్నేహితులు ముగ్గురు, కారుడ్రైవర్ సాయితో కలిసి శ్రీకాళహస్తి వెళ్తున్నారు. కందుకూరు ఫ్లైఓవర్ ఎక్కే సమయంలో రోడ్డు ఎత్తుపల్లాలుగా ఉండటంతో డ్రైవర్ సాయి కారు వేగాన్ని ఒక్కసారిగా తగ్గించాడు. దీంతో వెనకాలే వేగంగా వస్తున్న అంబులెన్స్ అదుపుతప్పి కారును బలంగా ఢీకొట్టింది. కారు డివైడర్ పైకి ఎక్కగా.. బెలూన్లు తెరుచుకోవటంతో ప్రాణాపాయం తప్పింది. స్వల్పంగా గాయపడిన డ్రైవర్ సాయిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా అంబులెన్స్ విజయవాడలో పేషెంట్‌ను దింపి తిరుగు ప్రయాణంలో బెంగుళూరు వెళ్తోంది. ప్రమాదం ధాటికి కారు ధ్వంసమైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

### టెన్త్ పరీక్షల్లో ముగ్గురు ఇన్విజిలేటర్లు రిలీవ్

**సింగరాయకొండ:** పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో బుధవారం నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు ఇన్విజిలేటర్లను డీఈఓ కిరణ్‌కుమార్ రిలీవ్ చేశారు. సింగరాయకొండ మండలంలో నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాలను డీఈఓ కిరణ్‌కుమార్ మధ్యాహ్నం సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వి.ఆనందరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్.వెంకటేశ్వర్లు, మరో ఉపాధ్యాయుడు పరీక్ష విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించి విధుల నుంచి తప్పించారు.

### రెండు ఆలయాల్లో చోరీ

- 3 సవర్ల బంగారం, 2 సీసీ కెమెరా డీవీఆర్ బాక్స్‌లు అపహరణ



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నాగమల్లీశ్వరరావు

**టంగుటూరు:** మండలంలోని వల్లూరులో రెండు ఆలయాల్లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు తెగబడ్డారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయం తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడిన దొంగలు.. 3 గ్రాములకు పైగా బంగారు కాసులు, ఇత్తడి కిరీటం, సీసీ కెమెరా డీవీఆర్ బాక్స్ అపహరించారు. అలాగే శివాలయంలో సీసీ కెమెరాల డీవీఆర్ బాక్స్ ఎత్తుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై నాగమల్లీశ్వరరావు పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు.

## టీచర్ సస్పెన్షన్.. హెచ్‌ఎంకు షోకాజ్



పాఠశాల వద్ద గుమిగూడిన బాలికల బంధువులు, స్థానికులు



మహిళలకు సర్దిచెబుతున్న సీఐ భీమానాయక్

- లైంగిక వేధింపుల కేసులో టీచర్‌కు రిమాండ్
- చట్టాన్ని అతిక్రమించొద్దని కనిగిరి డీఎస్పీ సూచన
- స్కూల్ వద్ద హెచ్‌ఎంతో బాలికల బంధువుల వాగ్వివాదం
- సర్దిచెప్పి పంపించిన పోలీసులు

**కనిగిరి రూరల్:** కనిగిరిలోని ఓ పాఠశాలలో బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీచర్ డి.వెంకట రంగారెడ్డిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సమస్యను చట్టపరిధిలో పరిష్కరిస్తామని చెప్పారు. రాస్తారోకో చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన వారిపై, అలాగే ఉపాధ్యాయుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

**టీచర్‌పై వేటు..**

లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయిన టీచర్ రంగారెడ్డిని సస్పెండ్ చేసినట్లు డీఈఓ కిరణ్ కుమార్ విలేకర్లకు తెలిపారు. అలాగే సమస్య బయటపడి పది రోజులైనా నిర్లక్ష్యంగా వ్యహరించిన హెచ్‌ఎం విజయలక్ష్మికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. కాగా బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

**స్కూల్ వద్ద ఆందోళన**

టీచర్ అసభ్యకర ప్రవర్తనపై పది రోజుల క్రితమే బాలికలు ఫిర్యాదు చేసినా హెచ్‌ఎం నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, బంధువులు బుధవారం పాఠశాల వద్ద ఆందోళన చేశారు. ముస్లిం మహిళలు పెద్ద సంఖ్యలో వెళ్లి హెచ్‌ఎంను నిలదీస్తున్న క్రమంలో వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసు సిబ్బందితో కలిసి పాఠశాల వద్దకు చేరుకున్న ఇన్‌చార్జి సీఐ భీమానాయక్.. ఆందోళనకారులకు సర్దిచెప్పి పంపారు.

### పాకల బీచ్‌లో యువకుడు గల్లంతు?

- మద్యం మత్తులో ఉన్న ఇద్దరు స్నేహితులు



సిసింద్రీ(ఫైల్)

**సింగరాయకొండ:** పాకల బీచ్‌లో బుధవారం ఓ యువకుడు తప్పిపోయిన సంఘటన మిస్టరీగా మారింది. పోలీసుల కథనం ప్రకారం.. టంగుటూరు మండలం ఎం.నిడమానూరు గ్రామానికి చెందిన సిసింద్రీ(27), అతని బంధువులు హర్ష, దినేష్ పాకల బీచ్‌కు వచ్చారు. వీరు ముగ్గురూ బీచ్‌లో పూటుగా మద్యం తాగారు. బీచ్ ఒడ్డున సిసింద్రీ వేసుకున్న దుస్తులు ఉన్నాయి తప్ప అతని చెప్పులు కనపడలేదు. మద్యం మత్తులో ఉన్న హర్ష, దినేష్ ఒక్కోసారి ఒక్కోమాట చెబుతున్నారు. ముగ్గురమే వచ్చామని ఒకసారి, ఆరుగురం కలిసి వచ్చామని మరో చెబుతుండటంతో తలపట్టుకోవడం పోలీసుల వంతైంది. వీరికి మద్యం మత్తు దిగితే తప్ప వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం లేదని పోలీసులు చెబుతున్నారు. సిసింద్రీ సముద్ర స్నానం చేస్తూ కొట్టుకుపోయాడా లేక మరెవరితోనైనా వెళ్లాడా అనేది విచారణలో తేలాల్సి ఉంది. కాగా సిసింద్రీ తప్పిపోయినట్లుగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. సిసింద్రీ బేల్దారి పని చేస్తుంటాడని, అతని బంధువులు ఇద్దరు తమ పర్యవేక్షణలో ఉన్నారని ఎస్సై చెప్పారు.

### తాళ్లూరులో పొగాకు బ్యారన్ దగ్ధం

- రూ.8 లక్షలు ఆస్తి నష్టం

**తాళ్లూరు:** ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన తాళ్లూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన ఇడమకంటి నాగిరెడ్డికి చెందిన బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా బుధవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. దాదాపు 1200 పొగాకు కర్రలు కాలిపోవడంతో రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు నాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు నాయకులు విజ్ఞప్తి చేశారు.